


నల్లగొండ సత్యనిష్ఠ

నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి భువనగిరి

27 శుక్రవారం నవంబర్ 2026 పేజీలు: 3

జడ్జి తండ్రి మృతికి సంతాపం

జాజుల లింగం గౌడ్ నివాళి



నల్గొండ, నవంబర్ 26 (సత్యనిష్ఠ): నల్గొండ జిల్లా రామన్నపేట మండలం భోగారం మాజీ గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, ప్రస్తుత హైకోర్టు జడ్జి కూనూరు లక్ష్మణ్ గౌడ్ తండ్రి కూనూరు గోపాల్ గౌడ్ పరమపదించడంతో బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈరోజు భోగారం గ్రామానికి వెళ్లి గోపాల్ గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జడ్జి కూనూరు లక్ష్మణ్ గౌడ్ ను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గోపాల్ గౌడ్ మరణం వారి కుటుంబానికి తీరని లోటని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని జాజుల లింగం గౌడ్ ఆకాంక్షించారు. ఆయన వెంట బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ బొల్లపల్లి స్వామి గౌడ్ ఉన్నారు.

ధర్వేశిపురం ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి 15 కోట్లు

- **రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి**
- **ఆలయానికి మరో 25 కోట్లు మంజూరు**
- **మహిళా సమాఖ్య భవనం ప్రారంభం**



నల్గొండ, నవంబర్ 26 (సత్యనిష్ఠ): నల్గొండ జిల్లా, కనగల్ మండలం, ధర్వేశిపురం రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.గురువారం ఆయన ధర్వేశిపురం రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయం వద్ద 15 కోట్ల రూపాయల పర్యాటక నిధులతో నిర్మించనున్న విశ్రాంతి గృహం, హరిత హోటల్, దేవాలయ సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. అంతేకాక నల్గొండ బైపాస్ నుండి నల్గొండ సాగర్ రోడ్డు వయా మంచినీళ్లబావి ధర్వేశిపురం, చర్లగౌరారం వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర 37 కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి పరిచే రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. మహబూబ్ నగర్ – నల్గొండ రోడ్డు మైల సముద్రం వరకు 5 కిలోమీటర్ల మేర 21 కోట్ల రూపాయలతో రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రానున్న సంవత్సరకాలంలో ధర్వేశిపురం ఎల్లమ్మ దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేసి వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. దేవాలయ అభివృద్ధికి త్వరలోనే మరో 25 కోట్ల రూపాయలు మంజూరు చేయించనున్నట్లు వెల్లడించారు. ధర్వేశిపురం చుట్టుపక్కల రోడ్ల అభివృద్ధికి 130 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టామని తెలిపారు. ఇదివరకే ధర్వేశిపురం రోడ్డు వెడల్పు చేయడం, డివైడర్ సెంట్రల్ లైటింగ్ వంటి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, 67 కోట్లతో దేవాలయ రోడ్డుతో పాటు, గ్రామంలో రహదారులు ఇతర పనులు చేపట్టామని వెల్లడించారు. రహదారి సౌకర్యం బాగుంటేనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని దృష్టిలో ఉంచుకొని నల్గొండ నుండి ధర్వేశిపురం వరకు 50 కోట్ల రూపాయలతో రోడ్డు పనులు చేపట్టామని, దీనివల్ల రోడ్డు ప్రమాదాలను కూడా నివారించవచ్చన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, ఇందిరమ్మ ఇండ్లు వంటివి అందిస్తున్నదని, రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరుగుతున్నదని, గురువారం నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టనుందని, ఇటీవలే ఇందిరమ్మ కుటుంబ జీవిత పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని, ఈ పథకంలో అందరు నమోదు చేసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి మందికి పైగా బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు.జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ధర్వేశిపురం ఎల్లమ్మ దేవాలయ అభివృద్ధిలో భాగంగా 15 కోట్లతో అభివృద్ధి పనులకు రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి శంకుస్థాపన చేశారని, అలాగే 37 కోట్లతో డబుల్ రోడ్డు అభివృద్ధి వంటి వాటి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకంలో అందరూ నమోదు చేసుకోవాలని, జిల్లాలో మహిళా సమాఖ్య భవనాలు పూర్తి చేయనట్లైతే వెంటనే పూర్తి చేయాలని కోరారు.స్థానిక సంస్థల ఇంచార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, నల్గొండ ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, ధర్వేశిపురం రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ చైర్మన్ వెంకటరెడ్డి, సర్పంచ్ రావుల శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్, ఇతర ప్రజాప్రతినిధులు, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గణేష్ తదితరులు ఉన్నారు. అంతకు ముందు మంత్రి రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దేవరకొండలో సంయుక్త ఎక్సైజ్ దాడులు

- **ఐదు మండలాల్లో విస్తృత తనిఖీలు**
- **25 కేసులు నమోదు, 10 మంది అరెస్టు**
- **56 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం**



దేవరకొండ, నవంబర్ 26 (సత్యనిష్ఠ): అక్రమంగా తయారు చేసే మద్యం మరియు ఇతర అక్రమ మద్యం కార్యకలాపాలకు వ్యతిరేకంగా చేపట్టిన ప్రత్యేక చర్యల్లో భాగంగా, నవంబర్ 25 మరియు 26 తేదీలలో దేవరకొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో విస్తృతమైన సంయుక్త దాడులు నిర్వహించబడ్డాయి. ఈ దాడులు నల్గొండ జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి ఎ. కిషన్ పర్యవేక్షణలో జరిగాయి. ఇందులో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలు, నల్గొండ ఎన్ ఫోర్స్ మెంట్, జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు, అలాగే దేవరకొండ, నల్గొండ, మిర్యాలగూడ మరియు హాలియా ఎక్సైజ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్లు మరియు దేవరకొండ ఎక్సైజ్ సబ్ ఇన్ స్పెక్టర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.ఈ సంయుక్త బృందాలు నేరెడుగొమ్ము, చందంపేట, మల్లెపల్లి, దేవరకొండ మరియు పి.ఎ. పల్లి అనే ఐదు మండలాల్లో దాడులు నిర్వహించాయి. గువల గుట్ట, సేవలాల్ తండా, జోడు భాయ్ తండా, చిత్రియాల, కచారవుపల్లి, పడమటి తండా, కంబాలపల్లి, పోగిళ్ల, మేగ్య తండా, అంబోతు తండా, బాలాజీ నగర్ తండా, పెద్ద తండా మరియు రేక్య తండా వంటి గ్రామాలు, ఆవాస ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేపట్టారు.సంయుక్త దాడుల ఫలితాలు: ఎక్సైజ్ చట్టంలోని సంబంధిత నిబంధనల ప్రకారం 25 కేసులు నమోదు చేయబడ్డాయి. 10 మంది వ్యక్తులను అరెస్టు చేశారు. 56 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు. 4,500 లీటర్ల ఎఫ్.జె. వాష్ ను అక్కడికక్కడే ధ్వంసం చేశారు. అక్రమ మద్యం కార్యకలాపాల్లో మళ్లీ పాల్గొనకుండా ఉండేందుకు 17 మంది వ్యక్తులపై బౌండ్ ఓవర్ చర్యలు తీసుకున్నారు.అక్రమ మద్యం తయారీ, నిల్వ, రవాణా మరియు విక్రయాలపై ఎక్సైజ్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటోంది. అక్రమ మద్యం కార్యకలాపాలను అరికట్టడానికి మరియు ప్రజారోగ్యాన్ని కాపాడటానికి ఇటువంటి ప్రత్యేక ఎన్ ఫోర్స్ మెంట్ డ్రైవ్ లు మరియు సంయుక్త ఆపరేషన్లు కొనసాగుతాయి. అక్రమ మద్యం తయారీ లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే, సమీపంలోని ఎక్సైజ్ స్టేషన్ కు తెలియజేసి, ఈ విషయంలో ఎక్సైజ్ శాఖకు సహకరించవలసిందిగా ప్రజలను కోరుతున్నాము.



ట్రాక్టర్ బోల్తా, రైతు రామారావు మృతి

కోదాడ – నవంబర్ 26 (సత్యనిష్ఠ) కోదాడ నియోజక వర్గం పరిధి లోని నడిగూడెం మండలం, రామాపురం గ్రామానికి చెందిన రైతు మిండే రామారావు (55) ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందారు. గ్రామస్తులు కుటుంబ సభ్యుల కథనం ప్రకారం గడ్డి తోలెందుకు వెళుతుండగా 13 బి కోమరబండ మేజర్ కాలువలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడటంతో తీవ్రంగా గాయాల పాలైన రామారావును ఖమ్మం తరలిస్తుండగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు మిండే రామారావుకు కూతురు, కుమారుడు ,భార్య ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యుత్ శాఖ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి



కరీంనగర్ రూరల్ నవంబర్ 26 సత్యనిష్ఠ: మండలంలోని బొమ్మకల్ గ్రామం కృష్ణానగర్‌కు చెందిన ర్యాకం శంకర్ (46) విద్యుత్ శాఖలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బొమ్మకల్ గ్రామంలో తన విధులు ముగించుకొని మోటార్ సైకిల్ పై కృష్ణానగర్‌కు తిరిగి వెళ్తుండగా లారీ అసోసియేషన్ సమీపంలోని రహదారిపై,రోడ్డు దాటుతున్న సమయంలో గోదావరిఖని వైపు నుంచి మోటార్ సైకిల్‌పై అతివేగంగా,అజాగ్రత్తగా వచ్చిన మహమ్మద్ తాజొద్దీన్ అనే వ్యక్తి శంకర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శంకర్ రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని 108 ద్వారా కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.మృతుడి భార్య శారద పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి ఆస్పత్రిలోనే ఆన్‌లైన్ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.అనంతరం శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం ప్రమాద స్థలాన్ని పరిశీలించిన కరీంనగర్ రూరల్ ఇన్స్పెక్టర్ ఎ. నిరంజన్ రెడ్డి,కృష్ణానగర్ నుంచి బొమ్మకల్ వైపు వెళ్లే వాహనాలు రహదారిని దాటే ప్రాంతం ప్రమాదకరంగా ఉన్నట్లు గుర్తించారు.ఈ సందర్భంగా ప్రజలు, వాహనదారులు రోడ్డు దాటే సమయంలో ఇరువైపులా వచ్చే వాహనాలను గమనించి,అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు.

ప్రభుత్వ శాఖల్లో అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి

- **ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి**
- **కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన బీజేపీ నాయకులు**



హుజూర్‌నగర్, సత్యనిష్ఠం: హుజూర్‌నగర్ పట్టణంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో చోటుచేసుకుంటున్న అక్రమాలు, అవకతవకలు, ప్రజా సమస్యలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొండ హరీష్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణానికి వచ్చిన జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్‌ను బీజేపీ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కొండ హరీష్ గౌడ్ మాట్లాడుతూ.. పట్టణంలో భూ అక్రమ రిజిస్ట్రేషన్లు, దేవాలయ భూముల ఆక్రమణలు, మున్సిపాలిటీ నిధుల దుర్వినియోగం, రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖల్లో జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకలపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అదేవిధంగా పట్టణంలో రోజురోజుకూ తీవ్రమవుతున్న ట్రాఫిక్ సమస్య, రైస్ మిల్లుల నుంచి వెలువడుతున్న బూడిదతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించినట్లు పేర్కొన్నారు. ప్రజల ఆస్తులకు, దేవాలయ భూములకు రక్షణ కల్పించాల్సిన అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. పట్టణంలోని సమస్యలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, రైస్ మిల్లుల బూడిద సమస్య నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ.. పట్టణంలో జరుగుతున్న పరిణామాలు తన దృష్టిలో ఉన్నాయని, ప్రభుత్వం ఈ విషయాలపై తీవ్రంగా ఉందని, ఏ ఒక్క అంశాన్ని నిర్లక్ష్యం చేయబోమని, బాధ్యులెవరినీ ఉపేక్షించబోమని హామీ ఇచ్చినట్లు కొండ హరీష్ గౌడ్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే బీజేపీ ప్రజల పక్షాన నిలబడి మరింత ఉధృతంగా పోరాటం చేస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చింతలపూడి ఉమామహేశ్వరరావు, జిల్లా నాయకులు బెల్లంకొండ నరేష్, పిడమర్తి చంద్రయ్య, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి కంటు నాగరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శులు గుండా గోపి, రాళ్లబండి రామారావు, యువ మోర్చా అధ్యక్షుడు బల్వంత్ సింగ్, శ్రావణ్, చిలకరాజు సైదులు, ములకలపల్లి నరేష్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

ఎస్ కే యం పిలుపు



కోదాడ-నవంబర్ 26 (సత్యనిష్ట) రైతాంగానికి ఇచ్చిన హామీలను బిజెపి ప్రభుత్వం అమలు చేయలేదని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షులు దొడ్డ వెంకటయ్య, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వర రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కోదాడ పట్టణంలో ఎస్.కె.ఎం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దగ్ధం అనంతరం నిరసన తెలియ జేయడం జరిగింది. (దిష్టిబొమ్మ నీ పోలీసులు తగల బెట్టకుండా అడ్డుకున్నారు) ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్పోరేట్ శక్తులకు అమ్ముడు పోయి ఈ దేశాన్ని దివాలా తీసేల రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని వారు ఆవేదన చేశారు. 2014లో అధికారం లోకి వచ్చిన బిజెపి రైతాంగ డిమాండ్లను పట్టించుకోక పోగ 2020లో రైతు వ్యతిరేక మూడు చట్టాలను తెచ్చి దేశాన్ని సర్వనాశనం చేసినరని వారన్నారు. దేశంలో ఎల్ నినో ప్రభావం వలన వర్ష బావ పరిస్థితి ఏర్పడిందని ఫలితంగా వ్యవసాయం చిన్న భిన్నమై రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటు ఊన్నారని, తెలంగాణ రాష్ట్రంలో 365 మండలాలను కరువు మండలాలుగా గుర్తించి రైతులకు న్యాయం చేయాలని వారన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కోటగిరి వెంకట నారాయణ రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు వక్కవంతుల నరసింహా రావు, రైతు సంఘం కోదాడ మండల కార్యదర్శి బొల్లు ప్రసాద్, సిఐటియు కోదాడ పట్టణ కార్యదర్శి ఎం ముత్యాలు, అరుణోదయ జిల్లా కార్యదర్శి ఉదయగిరి, జంగపల్లి శ్రీను, అన్నం పాపిరెడ్డి, పృద్వి, వెంకన్న, సైదులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్త, పప్పుల కోటయ్య గుండెపోటుతో మృతి

మొక్క బిక్షపతి మండల పార్టీ నడిగూడెం అధ్యక్షులు సంతాపం



కోదాడ-నవంబర్ 26 (సత్యనిష్ట) కోదాడ నియోజకవర్గ పరిధిలోని నడిగూడెం మండలం చెన్న కేశవపురం గ్రామంలో సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త పప్పుల కోటయ్య గుండెపోటు తో అకాల మరణం చెందారు. వారి కుటుంబ సభ్యుల్ని పరామర్శించి కోటయ్య భౌతిక దేహానికి పూలమాలలు వేసిన మండల కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమంలో చెన్న కేశవపురం సర్పంచ్ గోసుల రాజేష్, మండల పార్టీ అధ్యక్షుడు మొక్క బిక్షపతి, కాంగ్రెస్ నాయకులు నడిగూడెం మండల పరిషత్ మాజీ వైస్ ఎంపీపీ గుండు పద్మ శ్రీనివాస్, కరివిరాల మాజీ సర్పంచ్ పాతకోట నాగేశ్వర రావు, వేణు గోపాలపురం సర్పంచ్ వేల్పుల సోమయ్య పాల్గొని వారి కుమారులు పప్పుల ఉపేందర్, నాగేంద్ర బాబుని ఓదార్చినారు.

రాజ్యాంగంపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలి



కోదాడ - నవంబర్ 26 (సత్యనిష్ట) భారత రాజ్యాంగంపై విద్యార్థులు అవగాహన పెంపొందించు కోవాలని కోదాడ నియోజక వర్గ పరిధి లోని నడిగూడెం మండల కేంద్రంలోనీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డి విజయ నాయక్ కోరారు. గురువారం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించు కొని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ నిర్వహించారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహేష్, ఈశ్వర్, ఉపేందర్ తదితరులు అధ్యాపకులు డాక్టర్ జాన్ పాషా, కృష్ణ, పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- అంబేద్కర్ విగ్రహానికి ఘన నివాళి
- సమాచార హక్కు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో వేడుకలు
- కేశవులు ముదిరాజ్



నల్గొండ, నవంబర్ 26 (సత్యనిష్ఠ): సమాచార హక్కు పరిరక్షణ సమితి మరియు ఎలక్షన్ వాచ్ కమిటీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కేశవులు ముదిరాజ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగాన్ని అంబేద్కర్ మనకు అందించారని కొనియాడారు. దేశంలోని ప్రతి పౌరుడికి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి ప్రాథమిక హక్కులను కల్పించిన ఘనత రాజ్యాంగానిదేనని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు, పారదర్శక పాలనకు సమాచార హక్కు చట్టం ఒక శక్తివంతమైన ఆయుధంగా పనిచేస్తోందని, ప్రతి ఒక్కరూ తమ హక్కులతో పాటు రాజ్యాంగం కల్పించిన బాధ్యతలను కూడా గుర్తెరిగి నడుచుకోవాలని కోరారు. రాజ్యాంగ స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అంబేద్కర్ ఆశయ సాధన కోసం తమ సంస్థల తరఫున నిరంతరం పోరాడుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నేలపట్ల సత్యనారాయణ, వాడపల్లి సాయిబాబా, తాళ్ల నిరంజన్, కాసుల అజయ్ కుమార్, సర్వయ్య, భువనగిరి సందీప్, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్ విగ్రహ శంకుస్థాపనకు తరలిన వాహనాలు

- పార్టీ జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే బాలు నాయక్
- మద్దిమడుగులో సీఎం రేవంత్ రెడ్డి రాక
- దేవరకొండ నుంచి భారీగా తరలిన కాంగ్రెస్ శ్రేణులు



దేవరకొండ, నవంబర్ 26 (సత్యనిష్ఠ): సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహం, ఆలయ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి తరలిన ధూప దీప నైవేద్య భోగ్ బావోజిల వాహనాలకు పార్టీ జెండా ఊపి ఎమ్మెల్యే బాలు నాయక్ ప్రారంభించారు. నాగర్ కర్నూల్ జిల్లా ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన ఆంజనేయ స్వామి సన్నిధి మద్దిమడుగులో నూతనంగా నిర్మించనున్న సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహం మరియు ఆలయ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేయనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్న సందర్భంగా దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ డోలు వాయించి, జెండా ఊపి వాహనాలను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా దేవరకొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి మద్దిమడుగుకు బయలుదేరిన పార్టీ నియోజకవర్గ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, బంజారా సోదరులు, అభిమానులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు తిప్పర్తిలో భారీ ర్యాలీ

- అంబేద్కర్ విగ్రహానికి ఘన నివాళులు
- విద్యార్థులకు రాజ్యాంగ ప్రతుల పంపిణీ
- రాజ్యాంగ విలువలు కాపాడాలి



తిప్పర్తి, నవంబర్ 26 (సత్యనిష్ఠ): రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని తిప్పర్తి మండల కేంద్రంలో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల విద్యార్థులు, యువకులు, అంబేద్కర్ వాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులకు రాజ్యాంగ ప్రతులను పంపిణీ చేసి, పాఠశాల నుంచి తిప్పర్తి బస్టాండ్ సర్కిల్ లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెడ్మాస్టర్ అరుణశ్రీ అందరితో రాజ్యాంగ పీఠికను పఠింపజేశారు. డీసీసీ అధికార ప్రతినిధి పాశం నరేష్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్ గా అంబేద్కర్ భారతదేశానికి అద్భుతమైన రాజ్యాంగాన్ని అందించారని, రాజ్యాంగం కారణంగానే భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా కొనసాగుతోందన్నారు. రాజ్యాంగాన్ని కాపాడి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, విద్యార్థులు, యువతకు రాజ్యాంగ విలువలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. తిప్పర్తి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం సుధీర్ మాట్లాడుతూ రాజ్యాంగం వల్లనే బడుగు, బలహీన వర్గాలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో సమాన అవకాశాలు లభిస్తున్నాయని, అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టాలని కోరారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం యువత పనిచేయాలని నాచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నరసింహ నాయక్, హెడ్మాస్టర్ అరుణశ్రీ, తిప్పర్తి గ్రామ కార్యదర్శి, ఎంపీటీసీలు కిన్నెర అంజి, పల్లె ఎల్లయ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి నల్పరాజు శ్రీనివాస్, అంబేద్కర్ వాదులు కత్తుల కొండయ్య, వంటేపాక యాదగిరి, వార్డు సభ్యులు తుమ్మల నాగరాజు, కిన్నెర రవి, నల్పరాజు సందీప్, లవిశెట్టి లక్ష్మణ్, మహమ్మద్ గౌస్, పాశం పుల్లారెడ్డి, నేదునూరి గోపి, నేదునూరి సాయి, బద్దం వరుణ్ తేజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సార్ ప్రైమ్ స్కూల్లో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



కోదాడ – నవంబర్ 26, (సత్యనిష్ఠ) కోదాడ లోని ఎస్సార్ ప్రైమ్ స్కూల్లో జోనల్ ఇన్చార్జి స్నేహలత ఆధ్వర్యంలో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జోనల్ ఇన్చార్జి స్నేహలత మాట్లాడుతూ భారత రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరు గౌరవించలని. భారత రాజ్యాంగం మన దేశ ప్రజాస్వామ్యానికి దిక్సూచి అని, ప్రతి పౌరుడికి సమాన హక్కులు, స్వేచ్ఛ, న్యాయం కల్పిస్తూ దేశ సమగ్రతకు బలమైన పునాదిగా భారత రాజ్యాంగం నిలుస్తుందని అన్నారు. ప్రిన్సిపాల్ పుల్లయ్య మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి పౌరుడు తెలుసు కోవడంతో పాటుగా మన బాధ్యతలను కూడా తెలుసు కోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులచే మాక్ అసెంబ్లీ నిర్వహించి, దాని ప్రత్యేకతను సోషల్ ఉపాధ్యాయురాలు జ్యోతి తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్ విగ్రహ శంకుస్థాపన

- మద్దిమడుగులో కార్యక్రమం
- అచ్చంపేటలో భారీ బహిరంగ సభ
- తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు

తిరుమలగిరి సాగర్, నవంబర్ 26 (సత్యనిష్ఠ): నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి ఆదేశాల మేరకు, తిరుమలగిరి సాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జటావత్ లాలు నాయక్ ఆధ్వర్యంలో ఈరోజు మద్దిమడుగులో నిర్వహించనున్న సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ శంకుస్థాపన కార్యక్రమం, అలాగే అచ్చంపేటలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో రంగుండ్ల తండ సర్పంచ్, తిరుమలగిరి సాగర్ మండల సర్పంచుల ఫోరం ప్రధాన కార్యదర్శి అంగోతు గోపాల్ నాయక్, సపావత్ తండ సర్పంచ్ బిక్కు నాయక్, కొంపల సర్పంచ్ రవీందర్, తునికినూతల సర్పంచ్ బొడక్క నాయక్ తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మండల అధ్యక్షుడు జటావత్ లాలు నాయక్ నాయకత్వంలో మండల కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా ఈ కార్యక్రమాలకు తరలివెళ్లడం జరిగింది.

ఆమ్ ఆద్మీ పార్టీ 14వ ఆవిర్భావ దినోత్సవం

- నల్గొండలో జెండా ఆవిష్కరణ
- అన్సారీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు
- పార్టీ శ్రేణులు భారీగా హాజరు



నల్గొండ, నవంబర్ 27 (సత్యనిష్ఠ): ఆమ్ ఆద్మీ పార్టీ 14వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నల్గొండలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ అన్సారీ ఆధ్వర్యంలో నల్గొండలో జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అద్దంకి రవీందర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎండి యూసుఫ్, భాషాపాక శ్రీనివాసులు, మోహన్, మోహన్ శివ, జాయిద్ తదితరులు పాల్గొన్నారు.